నకిలీ వేలిముద్రలతో బురిడీ

ఫెవిగమ్+వ్యాక్స్= ఫింగర్ ప్రింట్

- జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల నకి'లీలలు'
- ముగ్గురు శానిటరీ ఫీల్డ్ సూపర్‌వైజర్ల వ్యవహారమిది
- ఏళ్ళుగా బల్దియా సొమ్ము కొల్లగొడుతున్న ఈ త్రయం
- ఇద్దరిని అరెస్టు చేసిన తూర్పు మండల టాస్క్‌ఫోర్స్



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ శానిటరీ విభాగంలో ఫీల్డ్ సూపర్‌వైజర్లుగా పని చేస్తున్న ముగ్గురు భారీ స్కెచ్ వేశారు. ఫెవిగమ్, వ్యాక్స్ (మైనం) విని యోగించి 31 మంది పారిశుద్ధ్య కార్మికుల నకిలీ వేలిముద్రలు సృష్టించారు. వీటిని వినియోగించి ప్రతి రోజూ తమ వద్ద ఉండే బయోమెట్రిక్ మిషన్లలో హాజరు తంతు పూర్తి చేశారు. ఇలా గడిచిన కొన్నాళ్ళుగా ప్రభుత్వ సొమ్మును కాజేసింది. ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న తూర్పు మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం ఇరువురిని పట్టుకున్నారని అదనపు డీసీపీ ఏవీఆర్ నర్సింహ్మారావు వెల్లడించారు. అంబర్‌పేట్, కర్మన్‌ఘాట్, జియాగూడ ప్రాంతాలకు చెందిన ఎ.సాయినాథ్, నాగరాజు, వి.విజయ్‌కుమార్ జీహెచ్‌ఎంసీ సర్కిల్–14లో సూపర్‌వైజర్లుగా పని చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉండే పారిశుద్ధ్య కార్మికుల వద్దకు ప్రతి రోజూ వెళ్లి బయోమెట్రిక్ మిషన్ల ద్వారా వారి హాజరును తీసుకోవడం వీరి విధి. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేసే ఒక్కో కార్మికుడికీ నిర్దేశిత పని వేళలు ఉంటాయి. పని ప్రారంభించే ముందు బయోమెట్రిక్ మిషన్‌లో లాగ్ ఇన్, పూర్తయ్యాక లాగ్ ఔట్ నిర్దేశిస్తూ వీళ్ల వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది. దీన్ని గమనించిన ఈ త్రయం కొన్నాళ్ళ క్రితం భారీ స్కెచ్ వేసింది. పారిశుద్ధ్య కార్మికుల నకిలీ వేలిముద్రలు తయారు చేయడంపై వీళ్ళు దృష్టి పెట్టారు. యూ ట్యూబ్‌లో సెర్చ్ చేయడం ద్వారా ఫెవిగమ్‌లో కొవ్వొత్తులకు సంబంధించిన మైనం (వ్యాక్స్) కలపడం ద్వారా ఓ రకమైన సింథటిక్ పదార్థం తయారు చేయవచ్చని తెలుసుకున్నారు. ఇలా రూపొందించిన దానిపై దానిపై జాగ్రత్తగా కార్మికుల వేలిముద్రల్ని సేకరించారు. ఆ సింథటిక్ పదార్థాన్ని వేలిముద్రల ఆకారంలో కట్ చేశారు. వీటిని తమ జేబులో వేసుకుని ఫీల్డ్‌కు వెళ్తున్న ముగ్గురూ అదును చూసుకుని లాగ్ ఇన్, లాగ్ ఔట్ కోసం వేలిముద్రలు వేసేస్తున్నారు. ఇలా పనికి రాని వారూ హాజరైనట్లు సృష్టించేస్తున్నారు. ఇలా ఆ పారిశుద్ధ్య కార్మికుడికి జీహెచ్‌ఎంసీ నెలకు ఇచ్చే జీతాన్ని స్వాహా చేస్తున్నారు. ఈ ముగ్గురూ కలిసి మొత్తం 31 మంది వేలి ముద్రల్ని తయారు చేసింది. కొన్నాళ్ళుగుట్టుగా సాగిన ఈ వ్యవహారంపై ఇటీవల తూర్పు మండల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనాథ్‌రెడ్డికి సమాచారం అందింది. ఆయన నేతృత్వంలో రంగంలోకి దిగిన ఎస్సైలు సి.వెంకటేష్, బి.అర్విండ్ గౌడ్, పి.నాగరాజు వలపన్నారు. గురువారం ఉదయం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వద్ద సాయినాథ్‌ను, సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద నాగరాజును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరి నుంచి మూడు బయోమెట్రిక్ మిషన్లు, 31 నకిలీ వేలి ముద్రలు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న విజయ్ కుమార్ కోసం గాలిస్తున్నారు. సాయినాథ్ పదేళ్ళుగా, నాగరాజు ఏడాదిన్నరగా జీహెచ్‌ఎంసీలో పని చేస్తున్నారని పోలీసులు తెలిపారు.

నేటితో ముగియనున్న పీజీ ప్రవేశాల రిజిస్ట్రేషన్లు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ వర్సిటీల్లో పీజీ కోర్సుల ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు శుక్రవారం గడువు ముగియనున్నట్లు టీఎస్ సీపీజీఈటీ–2023 కన్వీనర్ ప్రొ.పాండురంగా రెడ్డి గురువారం తెలిపారు. మొదటి విడత కౌన్సెలింగ్‌కు ఇంతవరకు 25 వేల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు. వివిధ వర్సిటీలలోని 50 కోర్సులకు 45 వేల పీజీ సీట్లు ఉండగా అందులో యూనివర్సిటీ క్యాంపస్ కాలేజీల్లో 8 వేలు ఉన్నాయన్నారు. సీట్లు సాధించిన విద్యార్థుల మొదటి జాబితాను ఈ నెల 26న విడుదల చేయనున్నట్లు చెప్పారు.

కాలేయ కేన్సర్‌కు విప్లవాత్మక చికిత్స

- కొత్త ఇమ్యునోథెరపీతో సత్ఫలితాలు
- ఏఐజీ హాస్పిటల్స్ అధ్యయనంలో వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: కాలేయ కేన్సర్‌ను సకాలంలో గుర్తించి, సత్వరమే చికిత్స చేసినప్పుడు అటెజోలిజుమాబ్, బెవాసిజుమాబ్‌ల కాంబినేషన్‌తో కూడిన సరికొత్త ఇమ్యునో థెరపీ మంచి ఫలితాలను అందిస్తుందని, గణనీయమైన సంఖ్యలో కాలేయ కేన్సర్ రోగులు కోలుకునేలా చేస్తుందని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. జర్నల్ ఆఫ్ క్లినికల్ అండ్ ఎక్స్‌పెరిమెంటల్ హెపటాలజీలో ప్రచురించిన అధ్యయన విశేషాలను గురువారం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన ఓ సమావేశంలో వైద్యులు వెల్లడించారు.

చికిత్సతో మంచి ఫలితాలు...

ఈ సందర్భంగా ఏఐజీ హాస్పిటల్స్ గ్యాస్ట్రో ఎంటరాలజీ చైర్మన్–చీఫ్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 'కాలేయ కేన్సర్‌కు కారణం వైరల్ హెపటైటిస్ బి అనేది ఎంతో కాలంగా మనకు తెలుసు. అయితే ఇప్పుడు అది నాన్–ఆల్కహాలిక్ స్టీటోహెపటైటిస్ లేదా ఫ్యాటీ లివర్‌గా మారుతోంది. దీనికి నిశ్చల జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మధుమేహం..వంటి కారణాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అందుబాటులోకి వచ్చిన కొత్త ఇమ్యునోథెరపీ చికిత్స అధునాతన కాలేయ కేన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పు' అని అన్నారు. ''అడ్వాన్స్ దశలోని కాలేయ కేన్సర్‌తో బాధపడుతున్న రోగులకు సంప్రదాయిక చికిత్సతో కణితిని పూర్తిగా రూపుమాపడం కష్టం. అయితే దీనితో సుమారు 10–13 శాతం మంది రోగులు కణితి సమస్యను పూర్తిగా అధిగమించారు. నాలుగో వంతు మంది పాక్షిక ఫలితాలుసాధించారని మేం గుర్తించాం'' అని ఈ అధ్యయన ప్రధాన రచయిత ఏఐజీ వైద్యులు డాక్టర్ ఆనంద్ కులకర్ణి చెప్పారు. సమావేశంలో ఏఐజీ ఆసుపత్రికి చెందిన హెపటాలజీ డైరెక్టర్ డాక్టర్ పీఎన్ రావు, జైపూర్‌లోని మహాత్మా గాంధీ హాస్పిటల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, హెపటాలజీ హెడ్ ప్రొఫెసర్ వివేక్ సరస్వత్, ఇండియన్ లివర్ కేన్సర్ మార్గదర్శకాలను రూపొందించిన సర్ గంగారామ్ హాస్పిటల్ (ఢిల్లీ) సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ ఆశిష్ కుమార్, ముంబయిలోని సర్ హెచ్‌ఎన్ రిలయన్స్ హాస్పిటల్ హెపటాలజీ డైరెక్టర్ డాక్టర్ ఆకాష్ శుక్లాలు ఈ చికిత్స విశేషాలను వివరించారు

అధ్యయనం సాగిందిలా...

అటెజోలిజుమాబ్, బెవాసిజుమాబ్ మందుల కాంబినేషన్‌లో సాగే ఈ ఇమ్యునోథెరపీ శరీర రోగ నిరోధక వ్యవస్థను ఉపయోగించి కేన్సర్ కణాలను చంపుతుందని పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనం కోసం నగరంలోని ఏఐజీ హాస్పిటల్‌కు చెందిన 59 మంది రోగులు, జైపూర్‌లోని మహాత్మా గాంధీ మెడికల్ కాలేజీకి చెందిన 8 మంది రోగులను ఎంచుకున్నారు. వీరిలో 12.9 శాతం మంది రోగులు కణితి నుంచి పూర్తి విముక్తి పొందగా..25.8 శాతం మందికి పాక్షికంగా నయమైంది. మొత్తంగా అధ్యయనం చేసిన 66.12 శాతం మంది రోగులలో వ్యాధి తీవ్రత తగ్గింది.

నేషనల్ సైన్స్ అకాడమీ ఫెలోగా డా. డి.శ్రీనివాసరెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్–ఐఐసీటీ) డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాసరెడ్డి 2023 సంవత్సరానికి ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ఫెలోగా ఎన్నికయ్యారు. తన నైపుణ్యంతో ఆయన వివిధ ఔషధాల తయారీలో ప్రముఖ పాత్ర పోషించారు. ఇరవయ్యేళ్లకు పైగా పరిశోధన రంగంలో మానవాళి ఆరోగ్యం కోసం ఔషధాల తయారీలో ఎనలేని సేవలందించారు. ఆయన చేసిన విశేష సేవలకు గాను ఇప్పటికే ఆయన కెమికల్ సైన్సెస్‌లో శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు, కేంద్ర ప్రభుత్వ జేసీ బోస్ నేషనల్ ఫెలోషిప్, సీఆర్ఎస్ఐ బ్రాంజ్ మెడల్ తదితర అవార్డులెన్నో పొందారు. ఆయన ఇప్పటికే నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, మహారాష్ట్ర అకాడమీ ఆఫ్‌సైన్సెస్, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోగా కూడా ఉన్నారు. నగరంలోని ఎన్‌జీఆర్ఐకి చెందిన డాక్టర్ మండల్, సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫ్రింటింగ్అండ్ డయాగ్నస్టిక్స్‌కు చెందిన మద్దిక సుబ్బసైతం ఈ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు.

సందడిగా గాంధీ వైద్యకళాశాల వ్యవస్థాపక దినోత్సవం



విద్యార్థినికి గోల్డ్‌మెడల్ అందిస్తున్న అలుమ్నీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజిరెడ్డి

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ 69వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు గాంధీ అలుమ్నీ అసోషియేషన్ ఆధ్వర్యంలో గురువారం సందడిగా జరిగాయి. అలుమ్నీ అసోషియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాజారెడ్డి, గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావులు ముఖ్యఅతిథులుగా హాజరై వేడుకల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతు వైద్య రంగానికి తమవంతు సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. అనేక సామాజిక సేవ కార్యక్రమాలతోపాటు వైద్యవిద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. సీపీఆర్, బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్)లపై సుమారు పదివేల మందికి ఉచిత శిక్షణ అందించామని అలుమ్నీ అసోషియేషన్ చైర్మన్ డాక్టర్ జీఆర్ లింగమూర్తి వివరించారు. అనంతరం ఆయా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన 36 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు అందించారు. తమకు వైద్యవిద్యను బోధించిన ఆనాటి గురువులు సుజాత, శ్రీనివాసరెడ్డి, శ్రీరాంరెడ్డి, మనోహర్‌రెడ్డిలతోపాటు, బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై ఉచిత శిక్షణ ఇచ్చిన వైద్యులు మహేశ్వరరెడ్డి, విజయరావు, బాస్కర్‌రెడ్డి, రజిత, నాగార్జునచక్రవర్తి, లక్ష్మీనారాయణ, రాజేష్, రామకృష్ణ, మెహిబ్‌హుస్సేన్, రోహిత్ రెడ్డిలకు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అలుమ్నీ ప్రతినిధులు లింగమూర్తి, వెంకటరత్నం, చంద్రశేఖర్, నందకుమార్‌లతోపాటు పలువురు వైద్యులు, పూర్వ విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్యాంటు..ఫ్యానులో బంగారం



శంషాబాద్: అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉదయం రియాద్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడిని కస్టమ్స్ అధికారులు తనిఖీ చేయగా అతడు ప్యాంటులో ప్రత్యేకంగా తయారు చేయించుకున్న జేబులో 582 గ్రాముల బరువు కలిగిన బంగారు బిస్కెట్లు బయటపడ్డాయి. బంగారం విలువ 35.35 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. మరో కేసులో కౌలాలంపూర్ నుంచి వచ్చిన ప్రయాణికుడి లగేజీలో ఉన్న సీలింగ్ ఫ్యాన్ యంత్రం కనిపించడంతో దానిని విప్పి చూశారు. అందులో 636 గ్రాముల బరువు కలిగిన బంగారం బయటపడింది. బంగారం విలువ 38.62 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



నిరాహారదీక్షలో పాల్గొన్న నాయకులు

కూకట్‌పల్లి: మాదిగల పోరాటానికి మద్దతు ఇచ్చి.. మేనిఫెస్టోలో పెట్టుకొని.. లేఖలు ఇచ్చి.. తీర్మానాలు చేసి అనేక వేదికల మీద మాట్లాడి అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించి న్యాయం చేస్తామని బీజేపీ హామీ ఇచ్చిందన్నారు. పదేళ్లు గడుస్తున్నా పార్లమెంట్‌లో సంపూర్ణ మెజార్టీ ఉన్నా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లు పెట్టకుండా దాటవేత ధోరణిని అవలంభిస్తోందని ఎమ్మార్పీఎస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్మంలో డోలక్ నర్సింగరావు, ఇంజమూరి యాదగిరి, సాల్మోన్, గౌరి శ్రీనివాస్, బాలస్వామి, కూర్మయ్య, యాకయ్య, ఆంజనేయులు, బాలకృష్ణ, సోమయ్య మాదిగలు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన



వడ్డేపల్లి రాజేశ్వరరావును అరెస్టు చేస్తున్న కూకట్‌పల్లి పోలీసులు

కూకట్‌పల్లి: బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఇందిరా పార్కు వద్ద చేపట్టిన దీక్షను ప్రభుత్వం అణిచివేసే ధోరణితో పోలీసులతో భగ్నం చేయించిందన్నారు. ఈ నిరంకుశ రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద దిష్టిబొమ్మను దహనం చేశారు. దీంతో పోలీసులు అడ్డుకొని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, నాయకులను అరెస్టు చేసి కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు సూర్య ప్రకాష్‌రావు, సూర్యరావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, ప్రేమకుమార్, వివిధ డివిజన్‌ల అధ్యక్షులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

విజయభేరి సభను జయప్రదం చేయాలి



కూకట్‌పల్లి: తుక్కుగూడలో ఈ నెల 17వ తేదీన నిర్వహిస్తున్న విజయభేరి భారీ బహిరంగ సభకు తెలంగాణ ప్రదాత సోనియాగాంధీ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే విజయ భేరి బహిరంగ సభ నిర్వహణపై గురువారం మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులోని రాయల్ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేశారు. సోనియాగాంధీ హాజరు కానున్న బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళరావు, నాయకులు సత్యం శ్రీరంగం, యాదగిరి, పట్లోళ్ల నాగిరెడ్డి, తూము వేణు, బషీర్, టోచర్, తూము సంతోష్‌కుమార్, మహేష్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, డివిజన్‌ల మహిళా అధ్యక్షురాళ్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పాదయాత్ర



ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్, నాయకులు

- కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ పాదయాత్ర

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలో గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సమస్యల పరిష్కారానికి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అభివృద్ధి పనులు దాదాపు పూర్తి చేశామన్నారు. కాలనీల్లో కొంత మేర పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, సీసీరోడ్ల పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. నవోదయకాలనీలో నిర్మాణ దశలో ఉన్న యూజీడీ పనులను పరిశీలించి, డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. పాదయాత్రలో చిన్న సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చారని వెంటనే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. బీఆర్‌యస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

కౌన్సిల్ సమావేశంలో ఫతేనగర్ సమస్యలపై ఏకరవు



ఫతేనగర్‌లో ఫ్లై ఓవర్ బాధితులతో కలిసి మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

బాలానగర్: జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ గురువారం మేయర్ గద్వాల విజయలక్ష్మికి డివిజన్ సమస్యలను ఏకరవు పెట్టారు. ఫతేనగర్ ఫ్లై ఓవర్ విస్తరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను కోరారు. నాలా రిటర్నింగ్ వాల్, దీన్‌దయాల్‌నగర్ వంతెన ఎత్తు పెంచడంపై అధికారులను వివరణ కోరారు. పై సమస్యలు ప్రస్తావించిన కార్పొరేటర్ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఈ వారంలో ఫతేనగర్ ఫ్లై ఓవర్ పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. అదే విధంగా ఫతేనగర్ ఫ్లై ఓవర్ బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ మేయర్‌కు వినతి పత్రం అందజేశారు.

◆ ఈ సందర్భంగా కార్పొరేటర్ సతీష్ గౌడ్ మాట్లాడుతూ... నిర్మాణ పనులు చేపట్టడానికి దుకాణాల సముదాయాల్లో వ్యాపారాలు చేస్తున్న వ్యాపారులు, నివాసాలు ఉన్నస్థానికులకు నోటీసులు ఇచ్చారన్నారు. ఆ నోటీసులు భవన యజమానుల స్థలంలో పాత రికార్డు ప్రకారం రోడ్డు ఉందన్నారు. నోటీసులు ఇవ్వడంతో వారి అనుమానాలను మేయర్ వద్ద చర్చించామని తెలిపారు. సమస్యలపై మేయర్ సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

17న విశ్వకర్మ యజ్ఞం

కూన శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వానం

కుత్బుల్లాపూర్: గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద ఈనెల 17న విశ్వకర్మ యజ్ఞం నిర్వహించనున్నారు. గురువారం విశ్వబ్రాహ్మణ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు బాల బ్రహ్మచారి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్‌ను మర్యాదపూర్వకగా కలిసి యజ్ఞానికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. విశ్వకర్మ యజ్ఞానికి తప్పక హాజరవుతానని తెలిపారు. అదే విధంగా ఆలయాభివృద్ధికి తనవంతు సహాయం ఎప్పుడు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి కమ్మరి రాజు, కోశాధికారి రవీందర్ చారి, ఉపాధ్యక్షులు కృష్ణ చారి, ప్రవీణ్ చారి, రామ్మూర్తి చారి తదితరులు ఉన్నారు.

భూగర్భ పైపులైన్ల వ్యవస్థను మెరుగు పరుస్తున్నాం



పాదయాత్రలో స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష బాబూరావు, తదితరులు



పాదయాత్రలో సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

మూసాపేట: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావుతో కలిసి గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు చేసిన అభివృద్ధికి మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులతో స్వాగతం పలికారు. ప్రజలు అందించిన వినతులను స్వీకరిస్తూ అభివృద్ధిని వివరిస్తూ పాదయాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని డివిజన్లలోని ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామనినారు. ఎక్కడా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎక్కడైనా సమస్య ఉంటే పాదయాత్రలో తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని పేర్కొన్నారు. భూగర్భ పైపులైన్ల వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో ఇక మంచినీరు కొరత రాకుండా హైదరాబాద్ మహానగరం నిలవబోతోందన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్‌లు శ్రావణ్‌కుమార్, పగుడాల బాబురావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పాదయాత్ర

మూసాపేట: సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బాలాజీనగర్ డివిజన్‌లో పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర శుక్రవారం డివిజన్ పరిధిలోని ఆంజనేయనగర్, పవర్‌నగర్, హబీబ్‌నగర్, సేవాలాల్ నగర్, రాఘవేంద్ర కాలనీ, కైత్లాపూర్, శ్రీరామ్‌నగర్ కాలనీ, కేపీహెచ్‌బీ 15వ ఫేజ్, జేఎన్ఎన్‌యూఆర్‌యూఏ, అంబేడ్కర్‌నగర్‌లలో కార్పొరేటర్ శిరీష బాబురావుతో కలిసి పర్యటించనున్నారు. ఈ పాదయాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, బస్తీ కమిటీ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పకడ్బందీగా నిమజ్జన ఏర్పాట్లు చేయాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- గణేశ్ నిమజ్జన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష



సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జెడ్సీ మమత, కార్పొరేటర్లు

కూకట్‌పల్లి: రాబోయే గణేశ్ నిమజ్జనోత్సవాలకు సంబంధించి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జోనల్ కమిషనర్ వి. మమతల ఆధ్వర్యంలో గురువారం ఐడీఎల్ చెరువు వద్ద అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశ్ నిమజ్జనానికి అత్యధిక జనాభా హాజరవుతారని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీస్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయం చేసుకొని ప్రజలకు సహకరించాలని సూచించారు. ప్రధానంగా ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తకుండా దారి మళ్లించి ట్రాఫిక్ బోర్డులు సూచికలను ప్రజలకు అర్థమయ్యేటట్లు వివరించాలన్నారు. తాగునీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నిఘా విభాగం, పారిశుద్ధ్యం నిర్వహణ సరిగా ఉండాలన్నారు. విద్యుత్ స్తంభాలను అవసరమైతే ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా పార్కింగ్‌కి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు కూడా వ్యక్తిగతంగా పరిశుభ్రత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు, పోలీస్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, నియోజకవర్గ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్ కిట్ల పంపిణీ


బ్యాగ్ కిట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శిరీష

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ టి.అంజయ్యనగర్‌లోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు గురువారం స్థానిక కార్పొరేటర్ శిరీష బాబురావు బ్యాగులను అందజేశారు. ప్రతి ఒక్క విద్యార్థి మంచిగా చదువుకోవాలని గొప్ప ఆలోచనతో గత ఏడాది నుంచి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విద్యార్థులకు బ్యాగ్ కిట్‌లను అందజేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ లీడర్ చైతన్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సావిత్రి, రాజేశ్వరి, శారద తదితరులు పాల్గొన్నారు.

త్వరలో డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు సర్దార్ పటేల్ నగర్, సాయి నగర్, 9వ ఫేజ్ ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన గురువారం ఆ ప్రాంతాల్లో పర్యటించి సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భవిష్యత్తులో ఎంతటి వర్షాన్ని అయినా తట్టుకునేలా భూగర్భ పైపులైన్లు నిర్మాణం చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే కృష్ణారావుల ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ డివిజన్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సూపర్‌వైజర్ వెంకటేష్, సాయినగర్ అచ్యుత రామయ్య, బాబు, రైల్వే ప్రసాద్, దుర్గా ప్రసాద్, వైయస్ ప్రసాద్, ఎస్పీ నగర్ సిహెచ్‌యస్ మూర్తి, కృష్ణం రాజు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.


9వ ఫేజ్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న దృశ్యం

టౌన్‌షిప్ వద్ద పార్కు నిర్మాణాల పరిశీలన...

మలేషియా టౌన్‌షిప్ వద్ద 5 ఎకరాల్లో నూతనంగా నిర్మిస్తున్న పార్కును, 9వ ఫేజులో నిర్మిస్తున్న పార్కు పనులను గురువారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పరిశీలించారు. అనంతరం డైమండ్ ఎస్టేట్స్ ఇన్ కార్ వన్ సిటీ వద్ద వరద కాలువ సంబంధించిన పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్, వన్‌సిటీ నరసింహారావు, కృష్ణ మోహన్, సుబ్బారావు, వెంకట్రావు, డైమండ్ ఎస్టేట్ శ్రీనివాసరావు, విద్యాసాగర్, కోటేశ్వరరావు, కృష్ణారావు, శ్రీధర్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్‌శాఖ పథకాల ఖాతాలు తెరిపించిన వడ్డేపల్లి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో వీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో పోస్టల్ లైఫ్ ఇన్సురెన్స్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, సుకన్య సమృద్ధి యోజన పథకం ఖాతాలను తన సొంత ఖర్చులతో తెరిపించారు. ఈ సందర్భంగా పోస్టల్ శాఖ సిబ్బంది మాట్లాడుతూ.. వడ్డేపల్లి రాజేశ్వరరావు గత సంవత్సరం నుంచి పోస్టల్ శాఖకు సహకారం అందిస్తున్నారని తెలిపారు. రూ.8 లక్షల తన సొంత ఖర్చులతో ఖాతాలు తెరిపించారన్నారు. ఢాక్ కమ్యూనిటీ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా ఇంటింటికి పథకాలకు దరఖాస్తు చేస్తున్నామని తెలిపారు. సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా పదేళ్ల లోపు ఉన్న ఆడపిల్లలను ఈ పథకంలో తన సొంత ఖర్చులతో చేర్పుతున్నారని తెలిపారు.

◆ బాలుర కోసం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ పథకానికి దరఖాస్తు చేస్తున్నామని చెప్పారు. పోస్టల్ లైఫ్ ఇన్సురెన్స్ ద్వారా ప్రమాద బీమాని దరఖాస్తు చేస్తున్నామన్నారు. అనంతరం పోస్టల్ శాఖ సిబ్బంది వడ్డేపల్లి రాజేశ్వరరావును శాలువాతో సత్కరించి, చిరు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ సౌత్ సబ్ డివిజన్ ఏఎస్పీ దండప్ప, కూకట్‌పల్లి పబ్లిక్ రిలేషన్ ఇన్‌స్పెక్టర్ నర్సింలు, కూకట్‌పల్లి ఎస్పీఎం హరిచందర్, తపాల శాఖ సిబ్బంది, కంటెస్టెంటెడ్ కార్పొరేటర్ శ్రీలక్ష్మి, డివిజన్ అధ్యక్షుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.


వడ్డేపల్లి రాజేశ్వరరావును సన్మానించి జ్ఞాపికను బహూకరిస్తున్న పోస్టల్ శాఖ అధికారులు

నిత్యావసరాల పంపిణీ

కూకట్‌పల్లి: ఎల్లమ్మబండ మహంకాళి నగర్‌లో జెంపన్న, సుజాత దంపతులు దివ్యాంగులు జీవనం సాగిస్తున్నారు. డాక్టర్ శిరీష ద్వారా విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ స్పందించి గురువారం వికలాంగుల కుటుంబానికి ఒక నెలకు సరిపడా నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా జెంపన్న, సుజాత దంపతులు రవిసింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ చారి, మనోజ్ కుమార్, అనిల్ కుమార్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా హిందీ దినోత్సవం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం హిందీ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, పద్య పఠనం, వివిధ సాంస్కృతి కార్యక్రమ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సి. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. హిందీ మన జాతీయ భాష అని 14 సెప్టెంబర్ 1949లో రాజ్యాంగబద్ధంగా జాతీయ భాషగా గుర్తింపు లభించిందన్నారు. దేశంలో ఎక్కువగా మాట్లాడే భాషలో ప్రధానమైటువంటి హిందీ లిపి దేవ నాగరి లిపి అన్నారు. హిందీ భాష నేర్చుకోవడం చాలా సులువని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాఖ్యాతగా హిందీ భాషా పండితురాలు ఎల్‌పీహెచ్ స్వప్న వ్యవహరించారు. తెలుగు పండితులు కృష్ణగౌడ్ సహకారం అందించారు.